క్లుప్తంగా

సన్మానం

ప్రొద్దుటూరు : స్థానిక కూరగాయల మార్కెట్ అధ్యక్షుడు వంగలి వలి బాషా, ప్రధాన కార్యదర్శి ఫ్రూట్ ఖాసీంకు అంజుమన్ అహలే ఇస్లాం కమిటీలో స్థానం కల్పించారు. ఇరువురికి సర్ఫరోస్ పదవులు ఇచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం మార్కెట్ కమిటీ వ్యాపారులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీసీ దాదాపీర్, అల్లాబకాష్, ఖాదర్‌వల్లి, వేణుగోపాల్, జహంగీర్ పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కోచింగ్ సెంటర్ డైరెక్టర్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు రైల్వే బోర్డు విడుదల చేసిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఉద్యోగాలు సాధించారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కె.సునీల్ బాబు, కె.సృజన్ శుక్రవారం తెలిపారు. కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, యు.వసుంధర ఆర్‌పీఎఫ్ ఉద్యోగాలు సాధించారని వారు వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం పోటీ పరీక్షలకు అనుగుణంగా బోధించడం, విద్యార్థుల పట్టుదల, కృషి ఈ విజయానికి కారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లతోపాటు అధ్యాపకులు పి.ధనుంజయరెడ్డి, సురేష్, నీలేష్, కిశోర్ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరు సబ్ డివిజన్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ పేర్కొన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

25న మండల సమావేశం

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25న ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరు అవుతారని తెలిపారు. కావున మండలంలోని అధికారులు ప్రణాళికలతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆక్రమణలో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములు, ఆస్తులను పరిరక్షించాలని మైనారిటీ నాయకుడు షరీఫ్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన శుక్రవారం మాట్లాడారు. ప్రొద్దుటూరులో కోట్ల రూపాయల వక్ఫ్‌బోర్డు ఆస్తులు, భూములు ఆక్రమణకు గురయ్యాయని అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. మోడంపల్లెలోని సర్వే నంబర్ 278/1లో 1.02 ఎకరాలు, సర్వే నంబర్ 260లో 1.23 ఎకరాలు ఉండగా.. ఈ రెండు సర్వే నంబర్లలో ఒక ఎకరా భూమికిపైగా ఆక్రమణకు గురైందన్నారు. ఆక్రమణకు గురైన వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రహరీలను నిర్మించాలని కోరారు. సమావేశంలో బాబాఫకృద్దీన్, కరీముల్లా, ముబారక్, మాబుహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరద చేసిన అప్పులకు సమాధానాలు చెప్పాలి

- ఆయనపై ఎన్నో అవినీతి ఆరోపణలు
- 15 ఏళ్లుగా బాకీలు చెల్లించలేదు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి నిజాయితీపరుడనే ముసుగులో ఎందరినో ఇబ్బందులకు గురి చేశాడని, 15 ఏళ్లు అయినా ఆయన కుటుంబ సభ్యులు చేసిన అప్పులు తీర్చలేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. ఆయన, ఆయన కుటుంబ సభ్యులు అనేక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. శుక్రవారం తన స్వగృహంలో రాచమల్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవరశెట్టి ఆదిలక్షుమ్మ మహిళా కళాశాల ఆర్యవైశ్యులది అన్న విషయం అందరికీ తెలుసునన్నారు. అభివృద్ధి పేరుతో కళాశాలకు సంబంధించిన 11 ఎకరాల స్థలాన్ని అమ్ముకునేందుకు గతంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే వరద జీఓ జారీ చేయించారన్నారు. అంతకు ముందు వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య హయాంలో ఇదే ప్రయత్నం చేసినా వారు అంగీకరించలేదన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి సోదరుడితోపాటు పలువురు ఇందులో స్థలాన్ని వాటాగా పంచుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఇదే స్థలంలో అపార్ట్‌మెంట్లు, విల్లాలను నిర్మించి అమ్ముతున్నారని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఈ విషయం తెలుసునని అన్నారు. విజయవాడలో రూ.కోట్ల విలువైన స్థలానికి సంబంధించి బ్రాహ్మణుడైన ఆడిటర్ చక్రపాణిని దహనం చేశారన్నారు. ఆ కేసులో ఎమ్మెల్యే వర్గీయుడైన శంకరాపురం ప్రసాద్‌రెడ్డి నిందితుడిగా ఉండగా, ఎమ్మెల్యే కుమారుడు కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కుమారుడు బచ్చల ప్రతాప్‌ను కేసు నుంచి తప్పించారని అన్నారు. హైదరాబాద్‌లో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఆర్యవైశ్యుడైన మిట్టా శివగణేష్‌ను కిడ్నాప్ చేసి తుపాకీతో బెదిరించిన సంఘటనపై కేసు నమోదైందన్నారు. నిత్యం ఎమ్మెల్యే పక్కనే ఉండే టీడీపీ పట్టణాధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డిని ఆర్థిక లావాదేవీల విషయమై భరించలేని విధంగా హీనమైన మాటలు మాట్లాడారన్నారు. చివరికి ధనియాల రాఘవరెడ్డి ఈవీ సుధాకర్‌రెడ్డిని విడిపించాల్సి వచ్చిందన్నారు. నేటికీ ఈవీ సుధాకర్‌రెడ్డికి ఇవ్వాల్సిన రూ.70 లక్షలు చెల్లించలేదన్నారు. సుందరాచార్యుల క్లబ్‌కు సంబంధించి రూ.కోటి 10 లక్షల మొత్తాన్ని టౌన్ బ్యాంక్ నుంచి డ్రా చేసి కొండారెడ్డి తీసుకున్నారని తెలిపారు.

కాంట్రాక్టు పనులను బెదిరించి తీసుకుంటున్నారు

నియోజకవర్గంలో జరిగే రోడ్డు కాంట్రాక్టు పనులను బెదిరించి ఎమ్మెల్యే వర్గీయులు తీసుకుంటున్నారన్నారు. ఊరందరికీ నీతులు చెప్పే ఎమ్మెల్యే తమ ఎస్ఎస్ మాల్‌కు సంబంధించిన రూ.5.70 కోట్ల పన్ను బకాయిలను ఎందుకు చెల్లించలేదన్నారు. పేదలు బాకీ ఉంటే గంట కొట్టి వసూలు చేయాలని చెప్పే ఎమ్మెల్యే తనకు సంబంధించిన ఎస్ఎస్ మాల్‌కు పన్ను చెల్లించరా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మనవడు అమల్ రెడ్డి హైదరాబాద్‌లో అపర్ణ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి తనకు వాటా లేకున్నా ఉందని చెప్పి రూ.40 కోట్లు వసూలు చేశారన్నారు. ఎమ్మెల్యే బాచేపల్లి శివప్రసాద్‌రెడ్డితోపాటు ప్రొద్దుటూరు ప్రాంతానికి సంబంధించి నాగులపల్లె గ్రామస్తులు డబ్బులు చెల్లించిన వారిలో ఉన్నారన్నారు. ఎస్ఎస్ మాల్ నిర్మాణానికి సంబంధించిన వ్యాపారులు కొప్పరపు పద్మనాభరావు, శ్రీధర్, ముత్యాలపాటి రమేష్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఎస్ఎస్ మాల్‌కు సంబంధించి వీరు పెట్టిన పెట్టుబడులను ఎమ్మెల్యే కుమారుడు తీసుకెళ్లి విశాఖపట్నంలో మరో వ్యాపారానికి సంబంధించి పెట్టుబడులు పెట్టారన్నారు. నిమ్మకాయల సుధాకర్‌రెడ్డికి చెందిన స్థలాన్ని చెరువు స్థలం అని పిటీషన్స్ పెట్టి రూ.6 కోట్లు తీసుకున్నాక అన్నీ సక్రమంగా ఉన్నాయని ఎమ్మెల్యే అధికారుల చేతే పని చేయించారన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి నందం రామయ్య, వద్ది బాలుడు, బద్వేలు రవి, టౌన్ బ్యాంక్ కుమార్‌రెడ్డి, కల్లూరు నాగేంద్రారెడ్డి, సినీ హబ్ రాజేశ్వరరెడ్డి, జొన్నలగడ్డ రవి, లారీ శ్రీను లాంటి వారెందరికో కోట్ల రూపాయల అప్పులు చెల్లించాల్సి ఉందన్నారు. 2007 నుంచి తీసుకున్న అప్పులను చెల్లించలేదని, ఇటీవలే తన వెంచర్‌లోని కొన్ని అపార్ట్‌మెంట్లను అప్పుల్లోకి రాయించారన్నారు.

వాస్తవాలను ప్రజలు గ్రహించాలి

ఎర్రచంద్ర ఎమ్మెల్యేకు అత్యంత విశ్వాసపాత్రుడని, కొత్తపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే తరఫున ఆయన పూర్వం ఏజెంటుగా కూర్చున్నారన్నారు. ఎమ్మెల్యే కుమారుడు కొండారెడ్డి ఆయన ఇంటిని తాకట్టు పెట్టి డబ్బు తీసుకోగా విడిపించకపోవడంతో చివరికి ఆ ఇంటిని వేలం వేశారన్నారు. చేసిన అప్పులు తీర్చకపోగా కాలం చెల్లిన తర్వాత తిరిగి అప్పు ఇవ్వాల్సిన వారికి బాండ్లను కూడా ఎమ్మెల్యే రాయించలేదన్నారు. వాస్తవాలన్నీ ప్రజలు గ్రహించాలని, ఇవి మచ్చుకు మాత్రమే చెబుతున్నానన్నారు. ప్రజలే న్యాయ నిర్ణేతలని తెలిపారు. వీటన్నింటికీ ఎమ్మెల్యే వరద సమాధానం చెప్పాలని రాచమల్లు కోరారు. ఈ సమావేశంలో సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చింపిరి అనిల్‌కుమార్, రాగుల శాంతి, గుర్రం లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి



బెడుసుపల్లెలో రైతులతో కలిసి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : మండలంలోని రాచాయపేట, బేతాయపల్లె రైతు సేవా కేంద్రాలను బద్వేలు వ్యవసాయ సహాయక సంచాలకులు ఎం.నాగరాజ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పలు రకాల రిజిష్టర్లును పరిశీలించారు. అన్నదాత సుఖీభవ, పి.ఎం.కిసాన్ పథకాలకు సంబంధించిన నగదు అర్హులైన ప్రతి రైతుకు అందాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రైతు ఈకేవైసీని 21వ తేదీ సాయంత్రంలోపల పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం బెడుసుపల్లెలో సాగులో ఉన్న సజ్జ పంటను పరిశీలించారు. ప్రస్తుతం యూరియా అవసరమైని రైతులు ఏడీఏ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయా రైతు సేవా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడీఏ వెంట ఏపీయం ప్రకాష్, వీఏఏలు చిట్టి, సుప్రియలు ఉన్నారు.

సొంత మండలంలో పని చేయకూడదనే నిబంధన తొలగించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మైదుకూరు : సచివాలయ ఉద్యోగులు సొంత మండలంలో పని చేయకూడదనే నిబంధనను తొలగించాలని ఏపీ విలేజ్, వార్డు సెక్రటరియేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ నిబంధనలను పేర్కొన్న జీఓ నంబర్ 5ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం వారు మైదుకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ నాయకులు బోరెడ్డి రమణారెడ్డి, రాటాల నరసింహప్రతాప్, పి.వెంకటయ్య విలేకరులతో మాట్లాడుతూ జీతం తక్కువగా ఉన్న తాము ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేయలేమని అన్నారు. గెజిటెడ్ ఉద్యోగులకు ఉండే నిబంధనలు చిరుద్యోగులైన తమపై పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. సొంత మండలంలోనే వేరే సచివాలయానికి బదిలీ చేయాలని కోరారు. రేషనలైజేషన్ తర్వాత బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. మిగులు ఉద్యోగులను ఏ శాఖలకు కేటాయిస్తారో, జాబ్ కార్డు ఎలా ఉంటుందో, ఎలాంటి పదోన్నతులు ఉంటాయో ముందుగానే స్పష్టంగా పేర్కొనాలని కోరారు.

10 గంటల పని విధానం రద్దు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 10 గంటల పని విధానం రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ 8 గంటల పని విధానం కోసం, పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల్లో సమ్మె హక్కులు, బోనస్, గ్రాట్యుటీ తదితర చట్టాల సాధన కోసం ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్నారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ సర్కార్ ఒక్కొక్కటిగా తొలగించేందుకు చర్యలు చేపడుతోందని విమర్శించారు. నేడు 10 గంటల పని విధానం తీసుకొచ్చి ప్రైవేటు యాజమాన్యాలకు కార్మికులను బాండేడ్ లేబర్‌గా మార్చడానికి కుట్ర పన్నిందన్నారు. 10 గంటల పని విధానానికి రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో తీర్మానం చేయించడం కార్మిక ద్రోహం అన్నారు. రాత్రి పూట పని వేళల్లో మహిళా కార్మికుల మాన ప్రాణాలకు భద్రత ఉండని నేటి పరిస్థితుల్లో అమలుకు నిర్ణయించడం సరైంది కాదన్నారు. ఈ నల్ల కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు వై.హరి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మధు, గురుమూర్తి, ప్రభాకర్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి పాఠశాల విలీన సమస్య

చియ్యపాడు దళితవాడ పాఠశాలలో డీఈఓ షంషుద్దీన్



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

చాపాడు : మండల పరిధి చియ్యపాడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను చియ్యపాడు హైస్కూల్‌లో విలీనం చేయడం.. ఈ విధానానికి తల్లిదండ్రులు అడ్డుపడుతున్న విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని జిల్లా విద్యాధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని చియ్యపాడు దళితవాడలోని ఎంపీపీ స్కూల్‌ను శుక్రవారం జిల్లా విద్యాధికారి షంషుద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నియమించిన మోడల్ పాఠశాల ఎంపికలో భాగంగా పలు చోట్ల ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా చియ్యపాడు దళితవాడలోని ఎంపీపీ స్కూల్‌ను విలీనం చేశారన్నారు. విద్యార్థులు హైస్కూల్‌కు పంపడం ఇష్టం లేకపోతే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. వారి ఆదేశాల వరకూ గ్రామంలోనే పాఠశాల నిర్వహణను ఇక్కడే కొనసాగిస్తామన్నారు. ఇదే క్రమంలో దత్తత తీసుకుని పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయిస్తానని డీఈఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

సౌకర్యాలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేవీ సుబ్బారావు

మైదుకూరు : పాలిటెక్నిక్ విద్యను అభ్యసించగోరు విద్యార్థులు మైదుకూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో సౌకర్యాలను వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుందని తెలిపారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కెమికల్ ఇంజినీరింగ్, మెటలర్జీ, కంప్యూటర్ ఇంజినీరింగ్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డిప్లొమా కోర్సులు ఉన్నాయని వివరించారు. మైదుకూరు కళాశాలలో ఈ కోర్సులలో చేరాలనుకునే విద్యార్థులు కళాశాల కోడ్ ఎంవైడీకేను ఎంపిక చేసుకొని, తగిన కోర్సులను ఎంచుకోవచ్చని తెలిపారు. మొదటి సంవత్సరంలోనే కంప్యూటర్ ఇంజినీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డిప్లొమాలో మైదుకూరు కళాశాలకు చెందిన విద్యార్థి అంతసేన రాష్ట్రంలోనే ప్రథమ ర్యాంక్ సాధించినట్టు పేర్కొన్నారు. తమ కళాశాలలో చేరే విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా వసతి సౌకర్యం ఉందని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందన్నారు.

బద్వేలులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేతలు



బద్వేలు నేతలతో మాజీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, నార్త్ అమెరికా ప్రత్యేక ప్రతినిధి

బద్వేలు అర్బన్ : విజయవాడ నుంచి బద్వేలు మీదుగా కడపకు వెళ్తున్న మాజీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ చల్లా మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నార్త్ అమెరికా ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్ శుక్రవారం బద్వేలులోని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి ఇంటికి విచ్చేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, తదితర విషయాలపై స్థానిక నేతలతో చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ సమన్వయకర్త కె.రమణారెడ్డి, మాజీ కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పుత్తా శ్రీరాములు, కాశినాయన మండల కన్వీనర్ హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు



హనుమంత వాహనంపై వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుక భాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారిని హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీనారాయణ హోమం, వేదస్వస్తి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు శ్రీవారి కల్యాణం

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9–30 గంటలకు స్వామి వారి కల్యాణ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని, సాయంత్రం గరుడ వాహనసేవ ఉంటుందని తెలిపారు.

సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

బద్వేలు అర్బన్ : సోలార్ విద్యుత్ వాడకం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ అన్నారు. స్థానిక బద్వేలు సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటం తగ్గించి పునర్వినియోగ శక్తిని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని అన్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వడంతోపాటు బ్యాంకర్లు కూడా అతి తక్కువ వడ్డీతో రుణాలందిస్తున్నాయని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణీక్రిష్ణ, డీఈఈ కుళాయప్ప, ఏఈలు నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి, బ్యాంకర్లు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

అట్లూరు టీడీపీలో అంతర్యుద్ధం

రెవెన్యూ డే సాక్షిగా బట్టబయలైన విభేదాలు

టాస్క్‌ఫోర్స్ : అట్లూరు టీడీపీలో అంతర్యుద్ధం రెవెన్యూ డే సాక్షిగా బట్ట బయలు అయింది. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో శుక్రవారం తహసీల్దారుతోపాటు సిబ్బంది రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి మండల అధ్యక్షురాలు పొత్తపి రమాదేవితోపాటు మండల టీడీపీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. అయితే సమావేశ వేదిక పైకి టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి వెళ్లి కూర్చోవడం జరిగింది. మండల అధ్యక్షురాలిని వేదిక పైకి పిలువక పోవడంతో.. 'నేను మండల అధ్యక్షురాలినై ఉండగా.. నన్ను వేదిక పైకి ఆహ్వానించరా? ఏ పదవీ లేని వారిని స్టేజీ పైన కూర్చోబెడతారా?' అని ఆమె అక్కడ నుంచి వెళ్లి పోవడం జరిగింది. అనంతరం ఆమె విలేకరులకు తన లెటర్ ప్యాడ్ ద్వారా పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'నేను మండల అధ్యక్షురాలిని అయి ఉండి నన్ను రెవెన్యూ డే వేదిక పైకి ఆహ్వానించలేదు. ఏ పదవి లేని కాప (రెడ్డి)కులానికి చెందిన నాయకుడు అయిన వ్యక్తిని ఎలా వేదిక పైన కూర్చోబెడతారు' అని మండల టీడీపీ అధ్యక్షుడిని పరోక్షంగా చూపుతూ రెవెన్యూ అధికారులను విమర్శించారు. అంతే కాదు 'నేను ఎస్సీ కులానికి చెందిన నన్ను వేదిక పైకి ఆహ్వానించలేదు నేను ఆ కులంలో పుట్టడం నేరామా?' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలను ఆమె పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఏది ఏమైనా వేదిక కథ అలా ఉంచితే .. మండలంలోని టీడీపీ మండల అధ్యక్షుడు చాలా సీనియర్ నాయకుడు ఆయనపై నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారు విమర్శలా అంటూ.. మండలంలోని టీడీపీ నాయకులలోనే గుసగుసలు మొదలయ్యాయి. కానీ పార్టీలోనే అంతర్యుద్ధం బట్ట బయలు అయిందని పలువురు పేర్కొంటున్నారు.

రెవెన్యూ ప్రతిష్ట పెంచేందుకు కృషి చేయాలి



బద్వేలులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్లు, ఉద్యోగులు

బద్వేలు అర్బన్ : రెవెన్యూ శాఖ ప్రతిష్ట మరింత పెంచేందుకు కింది స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బద్వేలు ఆర్డీవో ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖలలోనూ రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనదని, ప్రతి రెవెన్యూ ఉద్యోగి మారుతున్న కాలానికి అనుగుణంగా విజ్ఞానాన్ని పెంపొందించుకొని విధులు నిర్వర్తిస్తే వినూత్నమైన ఫలితాలను సాధించవచ్చని అన్నారు. తొలుత ఆర్డీవో కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు రెవెన్యూ ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అలాగే రెవిన్యూశాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, అడంగల్, ఆర్ఎస్ఆర్, 1బి వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందించిన విశ్రాంత ఉద్యోగులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో ఉదయభారతి, బద్వేలు, గోపవరం, బి.కోడూరు తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, దస్తగిరి ఆయా మండలాల రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

కాశినాయన : ప్రజలు రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. అనంతరం నరసాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీ రవిశంకర్, సర్వే డీటీ రవి, ఆర్ఐ అమరనాథ్‌రెడ్డి, వీఆర్ఓలు, వీఆర్ఏలు, ప్రజలు పాల్గొన్నారు.

త్వరలో పరిహారం

రాజుపాళెం : మండలంలో హైవే రహదారికి భూములు కోల్పోయిన రైతులకు త్వరలో నష్టపరిహారం వారి అకౌంట్లలో జమ అవుతుందని తహసీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాజుపాళెంలోని గ్రామ సచివాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డి, ఆర్ఐ హుసేన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ వల్లి, వీఆర్ఓ కృష్ణమూర్తి, ఎల్లారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాసనగర్‌లోని రాఘవేంద్ర హైస్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా పట్టణాధ్యక్షుడు రమణయ్య, బీజేపీ నాయకుడు చలపతిరావు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ నగర్‌లోని పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొందని, మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయిందని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. రాఘవేంద్ర హైస్కూల్ వద్ద వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు.

యోగాతో ఆరోగ్యం



యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : 11వ అంతర్జాతీయ యోగాంధ్ర సందర్భంగా శుక్రవారం బి.మఠంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి , ఎంపీడీఓ వీరకిషోర్, మండల స్థాయి అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా చేస్తే ఆరోగ్యం మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి, వైద్యం, విద్య, శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీహైస్కూల్‌లో..

బి.మఠంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీఓ వీరకిషోర్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, విద్యార్థులు, అధికారులు పాల్గొనాలన్నారు.

మైదుకూరు : యోగాంధ్రలో భాగంగా శుక్రవారం స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి స్థానిక శ్రీకృష్ణ దేవరాయల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. యోగాపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఇలియాస్ అహమ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.